క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలో జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ శివకుమార్‌ను గురువారం హుజూరాబాద్ బార్ అసోసియేషన్ మెంబర్స్ మర్యాద పూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ కోర్టులోని వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, ఉప ప్రధాన కార్యదర్శి పిట్టల రాజేష్, లైబ్రరీ సెక్రెటరీ చొడమల్ల భాను కిరణ్, మాజీ అధ్యక్షుడు అందె వెంకటేశ్వరరావు, నల్ల భూమిరెడ్డి, న్యాయవాదులున్నారు.

పరిహారం చెల్లించాలని..

శంకరపట్నం: కలెక్టర్ మేడమ్.. మీరే మాకు న్యాయం చేయాలని జాతీయ రహదారిలో ప్లాట్లు కోల్పోయిన భూ బాధితులు దరఖాస్తులు అందజేశారు. మండలంలోని కేశవపట్నంలో సర్వే నంబర్ 552లో పల్కల శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి మహేందర్‌రెడ్డి, పొన్నపూల రాజయ్య, జనగాం బుచ్చయ్య, నామని సంపత్, సిరిగేటి స్వరూప, గోపు మాధవి–శ్రీనివాస్‌రెడ్డి, కాటం వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్‌లు ఇండ్ల స్థలాలు కొనుగోలు చేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోతున్నామని తక్కువ ధర చెల్లించారని కేశవపట్నంలో నిర్వహించిన భూభారతి సదస్సులో కలెక్టర్ ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

'రజతోత్సవ సభను అడ్డుకునే ప్రయత్నాలు'

హుజూరాబాద్: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించనున్న రజతోత్సవ సభను అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని పార్టీ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై అబద్ధపు కేసు కేసు పెట్టించారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసమే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కౌశిక్ రెడ్డికి కేసులు కొత్త కాదని, సభ సక్సెస్ చేయడానికి మరింత పట్టుదలతో పనిచేస్తున్నారని, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, రైతులు సభకు తరలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు బండ శ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పొల్సాని సత్యనారాయణ, కొలిపాక శ్రీనివాస్, గందె శ్రీనివాస్, ఇరుమళ్ల సురేందర్ రెడ్డి, రమేశ్, సదానందంగౌడ్, రమేష్, మక్కపల్లి రమేశ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం

ఇల్లందకుంట: మండలంలోని వంతడ్పుల గ్రామానికి చెందిన కనవేన కోమల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావనివెంకటేశ్ ద్వారా మృతురాలి కుటుంబానికి రూ.5000 అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పలకల కృష్ణారెడ్డి, సప్పి మొగిలి, గ్రామశాఖ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, కొమురయ్యగౌడ్, మంద శివకుమార్, వీరుపాక్ష శ్రీనివాస్, హరీశ్, కిరణ్, రాజకుమార్, అరుణ్, అంకూస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా కుటుంబానికి..

చిగురుమామిడి: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న మీనుగుల ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆమె కుటుంబ సభ్యులకు ఐసీడీఎస్ నుంచి సూపర్‌వైజర్ శ్రీలత రూ.పదివేలు, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, అనురాధ, సంపూర్ణ, ఇందిర, ఆయాలతో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి యాభై కిలోల బియ్యం అందించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



బహుమతి ప్రదానం చేస్తున్న శ్రీనివాస్

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న హుజూరాబాద్ ఎల్పీఎల్–1 క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. టోర్నమెంట్‌లో అనేక జట్లు పాల్గొని ప్రతిభ కనబరిచాయి. గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.మూడువేల నగదు బహుమతి, రన్నర్ టీంకు ట్రోఫీతో పాటు రూ.రెండు వేల నగదును బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు అంకతి శ్రీనివాస్ అందజేశారు.

పశువులకు టీకాలు

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ గ్రామంలో డాక్టర్ అరవింద్‌రెడ్డి గురువారంపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సుష్మిత, సిబ్బంది ప్రఫుల్లా, విజయలక్ష్మి, మమత, సంధ్య, కిరణ్,రాజయ్య, గ్రామస్తులు కొమురయ్య, మల్లయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా ప్రయాణం

- గుండి సమీపంలో ధ్వంసమైన లోలెవల్ వంతెన
- ఎప్పుడు కూలుతుందోననే భయాందోళనలో ప్రయాణికులు, వాహనదారులు
- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు
- రెండేళ్ల క్రితం పనులకు శంకుస్థాపన
- ఇకనైనా పనులు ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు



ప్రమాదకరంగా లోలెవల్ వంతెన(వృత్తంలో)



2023లో వేసిన శిలాఫలకం

రామడుగు: మండలంలోని గుండి గ్రామ సమీపంలో ఊర చెరువు మత్తడి నుంచి వచ్చే నీరు వెళ్లేందుకు దాదాపు యాభై ఏళ్ల క్రితం లోలెవల్ వంతెన నిర్మించారు. ఇది ఎప్పుడు కూలిపోతుందో.. ఎలాంటి ప్రమాదం చూడాల్సి వస్తుందోనని గ్రామస్తులతోపాటు వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వంతెన కింది భాగం పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా ఉందని భయపడుతున్నారు. కరీంనగర్ నుంచి వెదిర క్రాస్ రోడ్డు ద్వారా రామడుగు –గోపాల్‌రావుపేట గ్రామం నుంచి జగిత్యాల జిల్లా పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది రోడ్డు మార్గంలో ఆయా గ్రామాలకు ప్రయాణం చేస్తుంటారు.

రెండేళ్ల క్రితం శంకుస్థాపన...

లోలెవల్ వంతెన ప్రమాదకరంగా మారడంతో దాని స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2023 ఆగస్టు 28న శంకుస్థాపన చేశారు. నేటికి పనులు ప్రారంభంకాలేదని శంకుస్థాపనకే పరిమితమైందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. నిత్యం వివిధ పనులపై పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు వెళ్లేవారు వంతెనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా ఆర్టీసీ బస్సులో రాలేని పరిస్థితి నెలకొందని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై భారీగా గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, గుంతలు పూడ్చాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ స్పందించకపోవడంతో చేసేదిలేక తిప్పలుపడుతున్నామని వాపోతున్నారు. ఇబ్బందికరంగా ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



రెండేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం మొదలుపెట్టని పరిస్థితి. పలుమార్లు పనులు ప్రారంభించాలని కోరినా స్పందన కరువైంది. పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు ప్రారంభించాలని కోరుతున్నాం.

– ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ, గుండి

ఇబ్బందులు తొలగించాలి



రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు.. హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయని సంతోషపడ్డాం. ఏళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి పనులు ప్రారంభించి గ్రామస్తులు, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి.

– శ్రీరామోజు సాయి, గుండి యువజన సంఘం నాయకుడు

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

హుజూరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను అధ్యాపకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వి.ఆంజనేయరావు, అధ్యాపకులు అభినందించారు. ఎంపీసీలో కస్తూరి సిరిచందన 879/1000, కె. అభిరామ్ 463/470, శ్రావణి 446/470, అభిరామ్ 443/470, వర్షిత 416/470, బైపీసీలో జె.మాధవి 379/440, సీఈసీలో పి.అర్చన 386/500, హెచ్ఈసీలో అఖిల 400/500. బైపీసీలో జార మరియం 873/1000, సీఈసీలో లక్ష్మణ్ 586/1000, హెచ్‌యుసీలో ఎం రామ్‌చరణ్ 928/1000, ఒకేషనల్‌లో రమేశ్ 792, వెంకటేష్ 896, అజయ్ 666, టీ.వెంకటేష్ 780/1000, అశోక్‌కుమార్ 395, అభినయ్ 389, మణికంఠ, యశ్వంత్ 341/500 సాధించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తులసీదాసు, వాసుదేవరావు, విజేందర్ రెడ్డి, రాజశేఖర్, మల్లారెడ్డి, సురేష్, వెంకటరమణ, మురళి మోహన్, రజిత, శైలజ, సుహాసిని, రేణుక, జ్యోతి, రజనీ, రాజేందర్, రాగమయి, రామరాజు, వనమాల పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెదిర గ్రామ పరిధి అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం విద్యాశాఖ, అల్ఫోర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఒలింపియాడ్ ఫౌండేషన్ తరగతులకు హాజరుకానున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. 8, 9వ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు 21 రోజుల పాటు ఉచిత భోజనం, వసతితో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీఈవో శ్రీనివాస్

రామడుగు: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, జిల్లా పరిషత్ సీఈవో మొగిలి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే గురువారం మండలంలో ప్రారంభమైంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా కురిక్యాల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. మిగతా గ్రామ పంచాయతీలకు 531 ఇళ్లు మంజూరు చేశారు. గ్రామాల వారీగా ఏడుగురు గెజిటెడ్ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. గర్శకుర్తి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో ఎంపీడీవో రాము, ఉప్పరమల్యాల, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో ఎంపీవో జనార్దన్‌రెడ్డి, గంగాధర, మధురానగర్, మంగపేట, ముప్పిడినర్సయ్యపల్లి, వెంకంపల్లి, వెంకటాయిపల్లి గ్రామాలలో పశువైద్యాధికారి సందీప్‌రెడ్డి, బూర్గుపల్లి, చర్లపల్లి(ఎన్), చర్లపల్లి(ఆర్) కొండాయిపల్లి, లింగంపల్లి, నర్సింహులపల్లి, సర్వారెడ్డిపల్లి గ్రామాలలో ఇరిగేషన్ ఎఈ మనీష్, లక్ష్మిదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, ర్యాలపల్లి, నారాయణపూర్‌లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, గట్టుభూత్కూర్, ఆచంపల్లి, చిన్నాచంపల్లి, ఒద్యారం గ్రామాల్లో ఎఈ వాజిత్‌అలీ, కాసారం, తాడిజర్రి, రంగరావుపల్లి, కొండన్నపల్లి, ఇస్లాంపూర్, కాచిరెడ్డిపల్లి గ్రామాల్లో గ్రిడ్ ఏఈ సుదీర్ ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందన్నారు.

దాతల సాయంతో పనులు



సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, అర్చకులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం జరిగే ప్రదేశంలో దాతల సాయంతో గురువారం సీసీఫ్లోరింగ్ పనులు నిర్వహించారు. కంకర, ఇసుక, సిమెంట్ తదితర వస్తువులను సమకూర్చిన దాతలను ఆలయ కమిటీ చైర్మన్ ముక్కా జితేంద్రగుప్తా ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా సన్మానించారు.

ధాన్యం చోరీ



తిమ్మాపూర్: మండలంలోని అలుగునూర్‌కు చెందిన రైతు ముంజ రాములు ధాన్యాన్ని బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. రాశి నుంచి సుమారు 60 బస్తాల ధాన్యాన్ని అపహరించారని, రూ.యాభై వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగలను కఠినంగా శిక్షించాలని బాధిత రైతుతో పాటు గ్రామస్తులు కోరారు. ఇటీవల బైకులు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు. వరుస చోరీలతో భయాందోళనకు గురవుతున్నామని, పోలీసులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

సమాచారం

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూ భారతి, కొత్త ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ రమేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. జమ్మికంట మండల రైతులు, రైతు సంఘాలు, ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు వేలం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయల విక్రయంతో పాటు భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలు పోగుచేసుకునేందుకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రాజ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మే 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని, ఆసక్తి గలవారు రూర.ఐదువేలు డిపాజిట్ చేసి ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్: హుజూరాబాద్ సహాయ కార్మిక ఇన్‌చార్జి అధికారిగా రఫీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారి చందన నెలరోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఈమేరకు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరే రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలతో సన్మానించారు. పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి తిరుపతి, చక్రపాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: బీసీ సంక్షేమ సంఘం చొప్పదండి మండల అధ్యక్షుడిగా మండలంలోని కొలిమికుంటకు చెందిన ఏగోలపు రాజ్‌కుమార్‌ను నియమిస్తూ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్యగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. నియామకానికి సహకరించిన నాయకులకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మీసేవా మండల అధ్యక్షుడిగా మురళి



శంకరపట్నం: మీసేవా ఫెడరేషన్ శంకరపట్నం మండల అధ్యక్షుడిగా జనువాల మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని నిర్వాహకులు తెలిపారు. గురువారం నిర్వహించిన ఆపరేటర్ల సమావేశంలో ఉపాధ్యక్షులుగా దుర్గం కిషన్, దాసరి గణేశ్, ప్రధాన కార్యదర్శిగా బొంగోని అభిలాశ్, కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా పిట్టల రాకేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్, టెక్నికల్ కోఆర్డినేటర్‌గా సంపత్‌రెడ్డి, సభ్యులుగా గొట్టెముక్కుల శ్యాం, తదితరులు ఎన్నికయ్యారని వివరించారు.

ఖాసీంపేటలో పోచమ్మ బోనాలు



గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేటలో గురువారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామ వీధుల గుండా ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని కేసీ క్యాంపులో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ తీగలను తాకేలా ఉన్న చెట్ల కొమ్మలను నరికి రోడ్డు పక్కనే పడేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎం. శ్రీనివాస్‌గౌడ్, విద్యుత్‌శాఖ ఏఈ, సెల్ నంబర్: 9440811451

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పహల్గాం మృతులకు నివాళి





జమ్మికుంటలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ, తిమ్మాపూర్‌లో కొవ్వొత్తులతో నివాళి

హుజూరాబాద్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ గురువారం నివాళి అర్పించారు. కేంద్రం ఉగ్రవాదులను అణచివేసి ప్రజల్లో ధైర్యం నింపాలన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళి అర్పించారు.

ఇల్లందకుంట: పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులు హేయమైన చర్య అని సీపీఎం ఇల్లందకుం మండల కార్యదర్శి రాము అన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకు ముందు మృతులకు నివాళి అర్పించారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్గునూర్ చౌరస్తాలో ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దాడికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బత్తుల రాకేశ్ డిమాండ్ చేశారు.

గన్నేరువరం: ఉగ్రమూకల దాడిని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ ఖండించారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

శంకరపట్నం: కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యంతోనే ఉగ్రవాదులు దాడి చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రివెంకటస్వామి ఆరోపించారు. మండలంలోని కేశవపట్నం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఉగ్రదాడిని సీపీఐ ఖండిస్తుందన్నారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

జమ్మికుంట: ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపల్ డా.రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం జమ్మికుంట మండలం వావిలాల, తనుగుల, నాగంపేట, అబాది జమ్మికుంట, జగ్గయ్యపల్లి, హుజూరాబాద్, ఇల్లందకుంట మండలంలోని చెల్పూర్, సిరిసేడు గ్రామాల్లో అధ్యాపకులు ఐదు బృందాలుగా ఏర్పడి వచ్చే విద్యా సంవత్సరం 2025–26 డిగ్రీ అడ్మిషన్లు కోసం ప్రచారం నిర్వహించారు. అనుభవం గల అధ్యాపకులు, డిజిటల్ గ్రంథాలయం, అధునాతన సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఎన్‌సీసీ యూనిట్ దాతల సహకారంతో కళాశాలలో డే స్కాలర్స్‌కు ఉచిత మధ్యాహ్న భోజనం వసతి కల్పిస్తున్నామనిఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. గోడ, కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, అధ్యాపకులు గణేశ్, రాజేంద్రం, శ్యామల, మాధవి, కిరణ్‌కుమార్, ఉమారాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఏఎస్ఐ ప్రతిభ



ఉమారాణిని అభినందించిన ఏసీపీ, సీఐ

జమ్మికుంట: జాతీయ స్థాయి టెన్నీస్ పోటీల్లో టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా ఏఎస్ఐ ఉమారాణి ప్రతిభ కనబరిచిందని హుజూరాబాద్ ఏసీసీ శ్రీనివాస్‌జి అభినందించారు. రెండు కాంస్య పతకాలు సాధించడం పట్ల గురువారం శాలువాతో సత్కరించారు. ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీలు కేరళ లో ఈ నెల 11 నుంచి 15 వరకు జరిగాయని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఉమారాణి పోటీల్లో పాల్గొని డబుల్స్, మిక్స్ డబుల్స్ విభాగంలో పతకాలు సాధించారు. టౌన్ సీఐ రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

తిమ్మాపూర్: గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఎస్‌బీఐ సౌజన్యంతో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని అలుగునూరులో ప్రారంభించామని తిమ్మాపూర్ మండల వలంటీర్, ట్రైనర్ కాత రజిత తెలిపారు. అల్గునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కో ఆర్డినేటర్ సంధ్యారాణి ఆదేశాలతో సీఏ స్వరూప చేతుల మీదుగా ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. మండలంలోని ప్రతీ గ్రామంలో నెలకు ఒక గ్రామాన్ని ఎంచుకొని 30 మంది మహిళలను బ్యాచ్‌గా ఏర్పాటుచేసి నెల రోజులు ఉచిత ట్రైనింగ్, సర్టిఫికెట్ అందించడం జరుగుతుందన్నారు. తిమ్మాపూర్‌లో మహిళా సంఘాల ద్వారా ట్రైనింగ్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్, ఇల్లంతకుంట, వీణవంక మండలాల ట్రైనర్లు పుల్ల సుజాత, కనకం జ్యోతి, ఐరెనీ ఇందిరా, అలుగునూర్ డివిజన్‌కు చెందిన మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు ధ్వంసం

గన్నేరువరం: ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు. కరీంనగర్ నుంచి మండలంలోని చొక్కారావుపల్లె గ్రామానికి వెళ్లే బస్సు బుధవారం జంగపల్లి గ్రామం మీదుగా వస్తుండగా ఇదే సమయంలో ఓ కులానికి చెందినవారు బోనాల నిర్వహిస్తున్నారు. బస్సు వెళ్లడానికి డ్రైవర్, కండక్టర్‌తో పాటు ప్రయాణికులు దారి ఇవ్వాలని కోరారు. గ్రామానికి చెందిన కొందరు ఓ ప్రయాణికుడిపై దాడి చేసి బస్సు అద్దాలు పగలగొట్టారని డ్రైవర్ మొండయ్య ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.